సాక్షి
సూర్యాపేట
బుధవారం ၊ 18 ၊ జనవరి ၊ 2023



ఉజ్వల భవిష్యత్తుకు నవోదయం
చలకుర్తి జేఎన్‌వీలో ఆరో తరగతిలో ప్రవేశాలకు ప్రకటన విడుదల అయ్యింది. - 8లో



పంట మార్పిడి చేస్తూ..
నడిగూడెం మండలంలో రైతులు పంట మార్పిడితో కూరగాయలు పండిస్తూ ఆదాయం పొందుతున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
32.0°/18°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఆహ్లాదంగా, రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఫిబ్రవరి 13, 14తేదీల్లో టీసీసీ పరీక్షలు

సూర్యాపేటటౌన్ : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ)కు సంబంధించి లోయర్, హయ్యర్ డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ పరీక్షలు ఫిబ్రవరి 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30గంటల వరకు జిల్లా కేంద్రంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని నంబర్ 2 ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కుడకుడ జెడ్పీహెచ్ఎస్, ఎంఏఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలుర పాఠశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. హాల్ టికెట్‌లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

గోదావరి జలాల తగ్గింపు



71డీబీఎం కాల్వకు తగ్గిన నీళ్లు

అర్వపల్లి: ఎస్సారెస్పీ రెండోదశ ద్వారా జిల్లాకు వస్తున్న గోదావరి జలాలను తగ్గించారు. జిల్లాకు 1600 క్యూసెక్కుల జలాలు వస్తుండగా 1200 క్యూసెక్కులకు తగ్గించినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. రైతులు ఈ నీటిని వృథా చేయకుండా పొదుపుగా పంటలకు వాడుకోవాలని ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ ఎం. సత్యనారాయణ, ఏఈఈ అమర్ కోరారు.

బీజేపీ విధానాలను తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : మతం పేరుతో మనుషుల్లో విషబీజాలు నాటుతున్న బీజేపీ విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆధునికయుగాన్ని ఆదిమయుగానికి తీసుకువెళ్లే సంఘ్ పరివార్ కుట్రను తిప్పి కొట్టాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగాలను ఉపయోగించుకుని విద్యా రంగంతో సహా అన్ని రంగాల్లోకి చొరబడి మతోన్మాద ఎత్తుగడను అవలంబిస్తోందన్నారు. మతం అనేది పౌరుల వ్యక్తిగతం కానీ మతాలను రాజకీయాలకు వాడుకొని హింసను ప్రేరేపించి లౌకిక, ప్రజాస్వామిక విలువల్ని ధ్వంసం చేయడం మతోన్మాదానికి నిదర్శనం అన్నారు. రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జనవరి 26న దేశవ్యాప్తంగా జరిగే ట్రాక్టర్ ర్యాలీల్లో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, బుర్రి శ్రీరాములు, ధరావత్ రవి నాయక్, మట్టిపెల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, నగారపు పాండు, చెరుకు ఏకలక్ష్మి, కోట గోపి పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన ఎన్‌క్యూఏఎస్ బృందం



బృందం సభ్యులతో వైద్య సిబ్బంది

కోదాడరూరల్ : మండల పరిధిలోని కాపుగల్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఎన్‌క్యూఏఎస్(నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్) బృందం రెండు రోజులుగా పరిశీలించి మంగళవారం ముగించారు. ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందున్న సౌకర్యాలను బృంద సభ్యులు డాక్టర్ సీమా మురళి, డాక్టర్ రాజేష్‌ల ఆధ్వర్యంలో పరిశీలించారు. ఆరు విభాగాల్లో మూడు వందలకు పైగా ప్రశ్నలతో కూడిన విశ్లేషణాత్మక అధ్యయనం చేశారు. సిబ్బంది పనితీరు, నైపుణ్యతను పరిశీలించారు. ఆస్పత్రిలో చేయాల్సిన మార్పులు, చేర్పులను సూచించారు. ఫైనల్ రేటింగ్ అనంతరం సర్టిఫికెట్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం, జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ లక్ష్మీప్రసన్న, అరుణ, సాంబశివరావు, సిద్దమ్మ, కృష్ణ, శ్రీదేవి, సుధా ఉన్నారు.

చిగురిస్తున్న ఆశలు

- టీచర్ల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కూడా..
- జాబితా సిద్ధం చేసేపనిలో విద్యాశాఖ
- వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు 3,612 మంది



సూర్యాపేటటౌన్ : ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టనున్నట్టు సంక్రాంతి పండుగ రోజు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. ఈనేపథ్యంలో జిల్లాలో సీనియర్ స్కూల్ అసిస్టెంట్లు(ఎస్ఏలు), సెకండరీ గ్రేడ్ టీచర్లు)ఎస్‌జీటీల జాబితా సిద్ధం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో రెండు మూడు రోజుల్లో జాబితా సిద్ధం చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో ఉపాధ్యాయుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

640 జీహెచ్‌ఎం, ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ...
జిల్లాలో వివిధ కేటగిరీల్లో మొత్తం 3,612 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే జీహెచ్‌ఎంలు మినహా స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్‌జీటీలకు ప్రమోషన్లు కల్పించనున్నారు. సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించనున్నారు. స్కూల్ అసిస్టెంట్‌లకు జీహెచ్‌ఎంలుగా, ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌లుగా ప్రమోషన్లు రానున్నాయి. జిల్లాలో జీహెచ్‌ఎంలు 106, స్కూల్ అసిస్టెంట్‌లు 416, ఎస్‌జీటీలు 118 ఖాళీలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అయితే ఎస్‌జీటీలు మినహా మిగతా ఖాళీలు పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. అయితే ప్రస్తుతం పదోన్నతులు, బదిలీల ప్రక్రియ జరిగితే ఈ విద్యా సంవత్సరం ముగిసే ఏప్రిల్ నెలలోనే తమకు కేటాయించిన పాఠశాలల్లో చేరాల్సి ఉంటుంది. అప్పటి వరకు ఎక్కడి వారు అక్కడే పని చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది.

మార్గదర్శకాలు వెలువడితేనే...
317 జీఓ అమలు చేశాక కొత్త జిల్లాకు కేటాయింపులయ్యాక మ్యూచువల్ బదిలీలు కూడా చేశారు. పలు జిల్లాల్లో కోర్టు కేసుల ద్వారానూ పలువురు టీచర్లు, వితంతులు బదిలీల ఉత్తర్వులతో చేరారు. జిల్లాలో ఎన్ని వేకేన్సీలు ఉన్నాయనేది వివిధ కేటగిరీల వారీగా కసరత్తు చేస్తున్నారు. మార్గదర్శకాలు వెలువడగానే వేకేన్సీల వివరాలు వెల్లడయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న ఖాళీల్లో 70శాతం పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తే బదిలీల అనంతరం ఇంకా ఎక్కెడెక్కడ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వేకేన్సీలు ఉన్నాయనేది వెల్లడి కానుంది.

జాబితా సిద్ధం చేస్తున్నాం
ఉన్నతాధికారులు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పదోన్నతులు, బదిలీలకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. మార్గదర్శకాలు విడుదలయ్యాకే ఖాళీలను అధికారికంగా వెల్లడిస్తాం. పదోన్నతులు, ట్రాన్స్‌ఫర్లకు సంబంధించి లిస్టును తయారు చేస్తున్నాం. రెండు మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో స్పష్టత రానుంది. -కె.అశోక్, డీఈఓ

జిల్లాలో ఉపాధ్యాయుల వివరాలు ..

కేటగిరీ	మొత్తం పోస్టులు	టీచర్లు ఉన్నవి	ఖాళీలు
జీహెచ్‌ఎం	182	76	106
పీఎస్ హెచ్‌ఎం	167	56	111
ఎస్ఏ (తెలుగు)	121	81	40
ఎస్ఏ (హిందీ)	100	72	28
ఎస్ఏ (ఇంగ్లిష్)	250	218	32
ఎస్ఏ (మ్యాథ్స్)	319	303	16
ఎస్ఏ (ఫిజిక్స్)	245	236	09
ఎస్ఏ (ఫిజిక్స్ ఉర్దూ)	01	00	01
ఎస్ఏ (బయోసైన్స్)	244	190	54
ఎస్ఏ (బయోసైన్స్ఉర్దూ)	01	00	01
ఎస్ఏ (సోషల్)	279	190	89
ఎస్ఏ(ఫిజికల్ ఎడ్యుకేషన్)	20	15	05
ఎల్‌పీటీ	140	133	07
ఎల్‌పీహెచ్	106	96	10
పీఈటీ	99	97	02
ఎస్‌జీటీ (తెలుగు)	1946	1828	118
ఎస్‌జీటీ (ఇంగ్లిష్)	11	11	00
ఎస్‌జీటీ (ఉర్దూ)	22	10	12

అందరి భాగస్వామ్యం అవసరం



సూర్యాపేటలో కంటి వెలుగు అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఎంపీ బడుగుల

- కంటి వెలుగు తరహా కార్యక్రమం తెలంగాణ మినహా మరెక్కడా లేదు
- 19నుంచి జిల్లాలో కంటి వైద్య శిబిరాలు
- విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- పేటలో అవగాహన ర్యాలీ

సూర్యాపేట: వైద్య ఆరోగ్యశాఖ చేస్తున్న కంటి వెలుగు ఉద్యమంలో అందరి భాగస్వామ్యం అవసరమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన కంటి వెలుగు అవగాహన ర్యాలీని మంత్రి ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. మానవ శరీరంలో అన్నింటి కంటే ప్రధానమని తెలిసి కూడా కంటి చూపు విషయంలో నిర్లక్ష్యం వహిస్తూ శాశ్వతంగా చూపు కోల్పోతున్న లక్షలాది మందిని చైతన్య పరిచి ఆదుకోవాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనల నుంచి పుట్టిందే కంటి వెలుగు కార్యక్రమం అని పేర్కొన్నారు. కేసీఆర్ అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమం ప్రపంచంలోనే ఎక్కడా లేదన్నారు. రెండో విడత కంటి వెలుగు కోసం జిల్లా వ్యాప్తంగా 600 క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. బాధితులకు అక్కడికక్కడే కళ్లజోళ్లు అందిచడమే కాకుండా అవసరమైన వారికి ఆపరేషన్ లకు కూడా రికమండ్ చేసి, వాటిని కూడా సంబంధిత ఆస్పత్రుల్లో చేయిస్తామన్నారు. చాలా మంది తమకు చూపు తక్కువ అయిందని తెలిసి కూడా ఆస్పత్రికి వెళ్లడానికి నిర్లక్ష్యం వహిస్తున్నారని , వారి కోసమే కేసీఆర్ నేరుగా గ్రామాల్లోకి వెళ్లి శిబిరాలు ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు ఢిల్లీ, పంజాబ్, కేరళ ముఖ్యమంత్రులు ఖమ్మంలో బుధవారం కంటి వెలుగును ప్రారంభిస్తారని, ఇక 19నుంచి సూర్యాపేట జిల్లాతో పాటు అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమం మొదలవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా వైద్యాధికారి కోటాచలం, మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, కమిషనర్ రామానుజుల రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, డాక్టర్లు హర్షవర్ధన్, మాండన్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు దొడ్డా నర్సయ్య



అమరులజ్యోతిని రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, వెంకట్‌రెడ్డిలకు అందజేస్తున్న నాయకులు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- చిలుకూరులో నర్సయ్య వర్ధంతి సభ



చిలుకూరులో దొడ్డా నర్సయ్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, పల్లా వెంకట్‌రెడ్డి, పార్టీ నాయకులు

చిలుకూరు : స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్యే దొడ్డా నర్సయ్య నేటి యువతకు ఆదర్శప్రాయుడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం చిలుకూరులో దొడ్డా నర్సయ్య 24వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సభలో మాట్లాడారు. దొడ్డా నర్సయ్య ఆ నాడు తెలంగాణసాయుధ పోరాటంలో ఈ ప్రాంతం నుంచి ముఖ్య భూమిక పోషించారన్నారు. ఈ ప్రాంతంలో రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టి పేద ప్రజలకు అండగా నిలిచిన మహనీయుడు నర్సయ్య అని కొనియాడారు. చిలుకూరులో ఆంధ్రమహాసభ నిర్వహించి ఈ ప్రాంతం గురించి చరిత్ర పుటల్లోకి ఎక్కించిన ఘనత నర్సయ్యదే అని పేర్కొన్నారు. కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ దొడ్డా నర్సయ్య లాంటి మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. పార్టీ జెండాను సాంబశివరావు ఆవిష్కరించారు. ఫంక్షన్‌హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.అమరవీరుల జ్యోతిని సాంబశివరావు, వెంకట్‌రెడ్డిలకు పార్టీ నేతలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, సీపీఐ సీనియర్ నాయకుడు దొడ్డా నారాయణరావు, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, నాయకులు ఉస్తెల సృజన, పల్లె నరసింహా, కొండా కోటయ్య, యల్లావుల రాములు, మేకల శ్రీనివాస్, బద్దం కృష్ణారెడ్డి, లతీఫ్, ధనుంజయనాయుడు, బత్తిని హనుంతరావు, ఉస్తేల నారాయణరెడ్డి, పాలకూరి బాబు, కంభాల శ్రీను, మల్లేశ్వరి, యాదగిరి, చేపూరి కొండలు, రెమిడాల రాజు, సాహెబ్ అలీ, దొడ్డా వెంకటయ్య, చిలువేరు ఆంజనేయులు, చేపూరి కొండలు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఆహ్వాన పత్రికలు

- కంటి వెలుగు విజయవంతమే లక్ష్యంగా పంపిణీ
- 1.20లక్షల కుటుంబాలకు అందనున్న ఆహ్వానం
- ఈనెల 19నుంచి కంటి వైద్య శిబిరాలు



కంటి వెలుగు ఆహ్వాన పత్రికలు, ఇతర మెటీరియల్

అర్వపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం విజయవంతానికి ఇంటింటికీ ఆహ్వాన పత్రికలను పంపిణీ చేస్తోంది. ఈనెల 18న కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని ఖమ్మంలో సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారు. ఆ తర్వాత 19న జిల్లా వ్యాప్తంగా కంటి వెలుగు వైద్య శిబిరాలు మొదలు కానున్నాయి. దీనికి సంబంధించి ప్రభుత్వం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఆహ్వాన పత్రికలను వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.20లక్షల కుటుంబాలకు ఈ ఆహ్వాన పత్రికలు అందనున్నాయి.

18ఏళ్లు పైబడిన వారందరికీ..
గతంలో చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. రెండో విడతలో 18ఏళ్లు పైబడిన వారికి మాత్రమే కంటి పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం 50 కంటి వెలుగు టీంలను ఏర్పాటు చేశారు. ఈ టీంలు 465 గ్రామపంచాయతీలు, 5 మున్సిపాలిటీలలో కంటి పరీక్షలు నిర్వహించనున్నాయి. కాగా ఇప్పటికే అన్ని పీహెచ్‌సీలకు ఆహ్వాన పత్రికలు చేరగా మొదట ఏ గ్రామంలోనైతే కంటి వెలుగు పరీక్షలు నిర్వహించనున్నారో అక్కడవాటిని పంచుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 18ఏళ్లు పైబడిన వారు 4.92లక్షల మంది ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ గుర్తించింది. కాగా ఇప్పటికే జిల్లాకు 46వేల కంటి అద్దాలు, కంటి పరీక్షలు చేసే యంత్రాలు, ఇతర సామగ్రి చేరాయి. వాటిని ఆయా పీహెచ్‌సీలకు పంపించారు.

19నుంచి శిబిరాలు



జిల్లాలో ఈనెల 19 నుంచి కంటి వెలుగు కార్యక్రమం మొదలవుతుంది. అయితే ఈసారి ఈ ప్రోగ్రాం విజయవంతానికి ఇంటింటికీ కంటివెలుగు ఆహ్వాన పత్రికలను అందజేస్తున్నాం. జిల్లాలో 1.20లక్షల కుటుంబాలకు ఈ పత్రికలు అందనున్నాయి. 50టీంల ద్వారా కంటి పరీక్షలు జరగనున్నాయి. – డాక్టర్ కె.హర్షవర్ధన్, కంటి వెలుగు జిల్లా ప్రోగ్రాం అధికారి

ముఖ్యమంత్రుల రాక కోసం..

- యాదాద్రిలో యంత్రాంగం ఏర్పాట్లు
- నేడు సీఎం కేసీఆర్ సహా.. ఢిల్లీ, పంజాబ్ సీఎంల రాక
- భద్రతను పరిశీలించిన సీపీ చౌహాన్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీపీ దేవేంద్రసింగ్‌చౌహాన్

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు బుధవారం ఉదయం ముఖ్యమంత్రులు కేసీఆర్, కేజ్రీవాల్, భగవంత్ సింగ్‌మాన్, మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ వస్తున్న సందర్భంగా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం రాచకొండ సీపీ దేవేంద్ర సింగ్ చౌహాన్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఇప్పటికే పాతగోశాల సమీపంలోని యాగ స్థలంలో హెలిపాడ్ సిద్ధం చేశారు. ప్రెసిడెన్షియల్ సూట్, మూడో ఘాట్ రోడ్డు, ప్రధానాలయం, యాగశాల స్థలాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ స్థాపించిన తరువాత సీఎం కేసీఆర్ మరో ఇద్దరు సీఎంలు, ఒక మాజీ సీఎంతో కలిసి తొలిసారి యాదాద్రికి రానుండడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్ యాదాద్రి పర్యటన షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదని సమాచారం. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ హైదరాబాద్ నుంచి నేరుగా ఖమ్మం సభకు వెళ్తున్నట్లు తెలిసింది.

యాదాద్రిలో గంట సమయం
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు సీఎం కేసీఆర్‌తో పాటు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ సీఎం అఖిలేష్‌యాదవ్ పర్యటన సోమవారమే ఖరారైంది. బుధవారం ఉదయం 11 గంటలకు ప్రగతి భవన్ నుంచి సీఎం కేసీఆర్‌తో ఆయా రాష్ట్రాల సీఎంలు కలిసి యాదాద్రికి బయల్దేరుతారు. 11.30 గంటలకు యాదాద్రి పాతగోశాలలోని యాగ స్థలానికి ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరుకోనున్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల మధ్యన యాదాద్రిలో ఉంటారు. స్వామివారి దర్శనం అనంతరం ప్రధానాలయ పునః నిర్మాణ విశేషాలను సీఎం కేసీఆర్ ఆయా రాష్ట్రాల సీఎంలకు వివరించనున్నారు. అక్కడి నుంచి ప్రెసిడెన్షియల్ సూట్‌కు వెళ్తారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రసాదం, భోజనాన్ని స్వీకరించి, మధ్యాహ్నం 12.30 గంటలకు ఖమ్మంలో జరిగే కంటి వెలుగు కార్యక్రమం, బీఆర్ఎస్ బహిరంగ సభకు యాదాద్రి నుంచే నేరుగా వెళ్తారు.

బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు..
యాదాద్రిలో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు క్షుణ్ణంగా తనిఖీలు చేశాయి. మూడు హెలిపాడ్‌ల వద్ద, ప్రెసిడెన్షియల్ సూట్, ఆలయ ఘాట్ దారి, రింగ్ రోడ్డు, ప్రధానాలయం, ఆలయ తిరు మాఢ వీధుల్లో తనిఖీలు చేపట్టారు.

రైతులకు చేయూత

- కర్షకులకు కిసాన్ క్రెడిట్ కార్డు
- జిల్లాలో 1.35లక్షల మంది అర్హులు
- అవసరమున్నప్పుడు డబ్బులు వాడుకునేలా కొత్త విధానం



కిసాన్ క్రెడిట్ కార్డులు

నాగారం : రైతు సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నాయి. ఇప్పటికే వివిధ పథకాలతో కర్షకులకు చేరువ కాగా తాజాగా కిసాన్ క్రెడిట్ కార్డు నిబంధనలను మరింత సరళతరం చేశాయి. కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ.6వేలు పొందుతున్న ప్రతి రైతు ఈ క్రెడిట్ కార్డు తీసుకునేందుకు అర్హుడు.

అవసరమైనప్పుడు..
కిసాన్ సమ్మాన్ నిధి కింద కేంద్ర ప్రభుత్వం ఏటా మూడు సార్లు రూ.2వేల చొప్పున రైతులకు అందజేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు కింద ఎకరానికి రూ.5వేల చొప్పున ఏడాదికి రెండు సార్లు బ్యాంకుల్లో జమ చేస్తోంది. ప్రమాదవశాత్తు రైతులు మరణిస్తే బాధిత కుటుంబానికి బీమా సొమ్ము రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.5లక్షలు అందుతుంది. దీన్ని నేరుగా బ్యాంకుల నుంచే రైతులకు చెల్లిస్తున్నారు. రైతు తనకు అవసరమైనప్పుడు నగదు తీసుకునేలా కిసాన్ క్రెడిట్ కార్డు ఉండాలని యోచిస్తోంది.

అర్హత ఉన్న వారికి..
జిల్లాలో 2,72,658 మంది రైతులు ఉన్నారు. వీరిలో 1,35,753 మంది రైతులు కిసాన్ సమ్మాన్ నిధిని పొందుతున్నారు. కిసాన్ సమ్మాన్ నిధి పొందుతున్న రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందించే అవకాశం ఉంది. దీంతో పాటు అదనంగా రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు రుణం పొందవచ్చు. తీసుకున్న రుణం 45 రోజుల్లో చెల్లిస్తే వడ్డీ కూడా ఉండదు. ప్రధాన మంత్రి బీమా యోజన అమలు చేసే అవకాశం ఉంటుంది. కొన్ని చోట్ల ఇప్పటికే ఈ పథకంలో రూపే కార్డుల, కేసీసీ కార్డుల పంపిణీ చేస్తున్నారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు ఇచ్చేందుకు బ్యాంకులు సిద్ధమవుతున్నాయి.

దరఖాస్తు విధానం ఇలా...
భూమి ఉండి 18-70 ఏళ్ల వయస్సు ఉన్న రైతులు ఈ కార్డు పొందే వీలుంది. దగ్గరలోని బ్యాంకులో ఖాతా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకును సంప్రదించవచ్చు. ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డుతో పాటు (ఆధార్, ఓటర్, డ్రైవింగ్ లైసెన్స్) తదితర ఏదైనా భూమి పాస్ పుస్తకాన్ని తీసుకెళ్లి బ్యాంకులో దరఖాస్తు చేసుకోవాలి. మీసేవ కేంద్రాల్లోనూ దరఖాస్తు పత్రాలు పొందవచ్చు.

రైతులకు అవగాహన కల్పిస్తాం



రూపే కార్డుల మంజూరు అంశంపై బ్యాంకర్లతో కలిసి రైతులకు అవగాహన కల్పిస్తాం. రైతులకు పెట్టుబడి అవసరం ఉన్న సమయంలో కేసీసీ కార్డుల ద్వారా ఎంతో ప్రయోజనం పొందవచ్చు. బ్యాంకర్లతో మాట్లాడి అర్హత ఉన్న ప్రతి రైతుకు కార్డు అందేలా చూస్తాం. – రామారావు నాయక్, డీఏఓ

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్
- అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, చిత్రంలో ఎస్పీ రాజేంద్రప్రసాద్, అదనపు కలెక్టర్ మోహన్‌రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఈనెల 26న భారత గణతంత్ర వేడుకల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ జిల్లా అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవం నిర్వహణపై మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని పరేడ్‌గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు, మైదానంతో పాటు వేదికలను పోలీస్, రెవెన్యూ, అధికారులు సిద్ధం చేయాలన్నారు. వేడుకల సందర్భంగా ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలకు ప్రొటోకాల్ ప్రకారం సీటింగ్ అరేంజ్‌మెంట్ చేయాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో కూడిన శకటలాలు, స్టాళ్ల సిద్ధం చేయాలన్నారు. గ్రౌండ్‌లో తాగునీరు, శానిటైజర్లు అందుబాటులో ఉంచాలని మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ భావం పెంపొందేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను ఎంపిక చేసి జనవరి 20లోగా ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగులకు స్నేహపూర్వక క్రికెట్ పోటీని జనవరి 25న జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు, ఆర్డీవోలు రాజేంద్ర కుమార్, కిషోర్‌కుమార్, ఏఓ శ్రీదేవి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాయుధ పోరాట యోధుడు నర్సిరెడ్డి కన్నుమూత



నివాళులర్పిస్తున్న కమ్యూనిస్టు నాయకులు

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని కాచారం గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సిద్దంకి నర్సిరెడ్డి (98) మంగళవారం కన్నుమూశారు. ఆయన భౌతికకాయానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మంగ నర్సింహులు, మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి, సీనియర్ నాయకులు దుంపల రామిరెడ్డి, పెంటారెడ్డి, శంకర్ తదితరులు నివాళులర్పించారు.

చెట్టు కొమ్మలు మీద పడి ఇద్దరికి గాయాలు

నకిరేకల్: నకిరేకల్ పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా మంగళవారం సాయంత్రం రహదారి పక్కన ఉన్న చెట్టు కొమ్మలు తొలగిస్తుండగా అవి దారి వెంట వెళ్తున్న వారిపై పడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని బాబాసాహెబ్‌గూడేనికి చెందిన ఎస్‌కే ఫైజాన్, ఎస్‌కే సల్మాన్ ద్విచక్ర వావనంపై నకిరేకల్‌కు వస్తున్నారు. మార్గమధ్యలో వాసవీ నగర్ సమీపంలో రోడ్డు పక్కన చెట్టు కొమ్మలు కటింగ్ చేస్తుండగా అవి వారి బైక్‌పై పడటంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం నల్లగొండకు తరలించారు.

రోడ్డు పక్కన వ్యక్తి మృతి

చిట్యాల: హైదరాబాద్ నుంచి కారులో వస్తున్న వ్యక్తి రోడ్డు పక్కన కారు ఆపి ఓ చెట్టు కింద కూర్చొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. తిప్పర్తి మండలం ఏ. దుప్పలపల్లి గ్రామానికి చెందిన గట్టుపల్లి రమణారెడ్డి(45) హైదరాబాద్ నుంచి కారులో స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో పెద్దకాపర్తి గ్రామ శివారులోనికి రాగానే అతడు కారును జాతీయ రహదారి పక్కన నిలిపి ఓ చెట్టు కింద కూర్చుండిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి చిట్యాల పోలీసులకు సమాచారం అందించగా వారు మృతుడి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేసి మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే రమణారెడ్డి ఫిట్స్ వచ్చి లేదా గుండెపోటుతో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కాగా ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెంలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగోజిగూడెంలోని బస్ స్టేజీ సమీపంలో నిర్మానుష్య ప్రాంతంలో స్థానికులు వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 50–60 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. దాదాపు 25 నుంచి 30రోజుల క్రితం మృతిచెందినట్లు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు నవోదయం

- జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 31 వరకు అవకాశం
- చలకుర్తి జేఎన్‌వీలో ఉమ్మడి జిల్లాకు 80 సీట్లు కేటాయింపు
- ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష



చలకుర్తిలోని జవహర్ నవోదయ విద్యాలయం

పెద్దవూర: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయి జవహర్ నవోదయ విద్యాలయాలు. జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశానికి ప్రకటన విడుదల అయ్యింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవటానికి ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం కల్పించారు. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు రావాలని కలలు కంటారు. 100 మార్కులకు గాను 90 మార్కులకు పైగా సాధిస్తేనే సీటు దొరికే అవకాశం ఉంది. ఈ విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 29న ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి చలకుర్తిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో మొత్తం 80సీట్లు కేటాయించారు.

దరఖాస్తు చేసుకునే విధానం ఇలా..

6వ తరగతిలో ప్రవేశానికి గాను అర్హత, ఆసక్తి గల విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జేఎన్‌వీనల్గొండ.ఇన్ లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ఫారంపై ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకం చేయించి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 5వ తరగతి ఏ పాఠశాలలో చదువుతున్నారో అక్కడి నుంచి స్టడీ సర్టిఫికెట్ తీసుకుని అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తుపై విద్యార్థి, తండ్రి సంతకాలు తప్పకుండా ఉండాలి. ఫొటో కూడా అప్‌లోడ్ చేయాలి.

అర్హులు వీరే..

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం ఐదో తరగతి చదువుతూ 01.05.2011 నుంచి 30.04.2013 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఈ నిబంధన ఎస్సీ, ఎస్టీ సహా అన్నివర్గాల వారికి వర్తిస్తుంది.

రిజర్వేషన్ విధానం

చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో మొత్తం 80 సీట్లు ఉండగా అందులో 75 శాతం సీట్లు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, 25 శాతం సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయించారు. గ్రామీణ ప్రాంత రిజర్వేషన్ వర్తించాలంటే 3, 4, 5 తరగతులు గ్రామీణ ప్రాంతాలలో చదివి ఉండాలి. ఏ ఒక్క రోజు పట్టణ ప్రాంతాలలోనూ, మున్సిపాలిటీలలో చదివినా గ్రామీణ ప్రాంత రిజర్వేషన్ వర్తించదు. ఎట్టి పరిస్థితులలోనూ ఒక్కసారి పరీక్షకు హాజరైన విద్యార్థి రెండో హాజరయ్యేందుకు అవకాశం లేదు. ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 7.5 శాతం, బాలికలకు మొత్తం సీట్లలో 1/3వ వంతు రిజర్వేషన్ సౌలభ్యం ఉంది.

పరీక్ష రాసే మాధ్యమం

విద్యార్థులు ఐదో తరగతి ఏ మాధ్యమంలో విద్యాభ్యాసం చేస్తున్నారో ఆ భాషలోనే పరీక్ష ఉంటుంది. దరఖాస్తు ఫారంలో పేర్కొన్న భాషలోనే టెస్టు బుక్‌లెట్ ఇస్తారు. దరఖాస్తు ఫారంలోనూ, ప్రవేశ పత్రంలో పరీక్షా మాధ్యమం ఒకేలా ఉండేలా చూసుకోవాలి.

పరీక్ష ఇలా..

ప్రవేశ పరీక్ష 5వ తరగతి స్థాయిలో మూడు విధాలుగా ఉంటుంది. మూడు విభాగాలలో కలిపి 80 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒకటింపావు మార్కు చొప్పున కేటాయిస్తారు. ప్రతి విభాగంలోనూ లఘు ప్రశ్నలు(ఆబ్జెక్టివ్ టైప్) ఉంటాయి. రీజనింగ్‌లో 40 ప్రశ్నలకు గాను 50 మార్కులు(60 నిమిషాల కాలవ్యవధి), గణితంలో 20 ప్రశ్నలకు గాను 25 మార్కులు(30 నిమిషాలు), భాషా పరిజ్ఞానంపై 20 ప్రశ్నలకు గాను 25 మార్కులు(30 నిమిషాలు) ఉంటాయి. మొత్తం రెండు గంటలలో 80 ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది. విద్యార్థులు సమాధానాలను ఐసీఆర్/ఓఎంఆర్ షీట్‌లో పూరించాలి.

1986లో ఏర్పాటు

కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో 1986 జాతీయ విద్యావిధానాన్ని అనుసరించి అప్పట్లో దేశ వ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లాకు సంబంధించి చలకుర్తి గ్రామంలో 45 ఎకరాల విస్తీర్ణంలో ఈ విద్యాలయాన్ని నిర్మించారు. ప్రతి సంవత్సరం ప్రవేశ పరీక్ష ద్వారా 6వ తరగతిలో ప్రవేశం కల్పిస్తారు. 6 నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్య, బాలబాలికలకు వేర్వేరుగా వసతి సౌకర్యం కల్పిస్తారు. 6 నుంచి 8వ తరగతి వరకు ప్రాంతీయ భాష లేదా మాతృ భాషలో విద్యా బోధన జరుగుతుంది. ఆ తర్వాత గణితం, సైన్స్ సబ్జెక్టులు ఆంగ్ల భాషలో, సామాజిక శాస్త్రములు హిందీ భాషలోనూ బోధిస్తారు.

కష్టపడితే సీటు ఖాయం



విద్యార్థులు కష్టపడితే జేఎన్‌వీలో సీటు సాధించవచ్చు. ఇందులో సీటు వస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. ప్రవేశ పరీక్ష ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో పారదర్శకంగా నిర్వహిస్తాం. ప్రశ్నపత్రం తయారీ నుంచి విద్యార్థుల ఎంపిక వరకు సీబీఎస్ఈ వారే నిర్వహిస్తారు. ప్రవేశ పరీక్ష రాయకుండా నవోదయలో సీట్లు ఇప్పిస్తామని చెప్పే వారిని నమ్మొద్దు.

– కేవీ నాగరాజకుమార్, ప్రిన్సిపాల్, చలకుర్తి జేఎన్‌వీ

ముగ్గురు దొంగల అరెస్టు

- రూ.2.90లక్షల నగదు, బైకు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు



దొంగలను చూపుతున్న పోలీసులు

భువనగిరి: పౌల్ట్రీఫాంలో డబ్బులు చోరీ చేసిన ముగ్గురు దొంగలను మంగళవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. భువనగిరి రూరల్ సీఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండల పరిధిలోని రాయగిరి గ్రామంలో గల ఆదర్శ పౌల్ట్రీ ఫాంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సంగపు వెంకటేశ్వర్లు ఈ నెల 15న గుడ్లు కొనుగోలు చేసిన వారి నుంచి రూ.3.10 లక్షలు తీసుకుని ఆఫీసులోని బీరువాలో పెట్టాడు. అందులోనే పనిచేస్తున్న వడ్డే వెంకటేష్ ఇది గమనించి బీరువాలో పెట్టిన డబ్బులను దొంగిలించాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన తన బంధువులు వడ్డే యాదగిరి, వడ్డే రామాంజనేయులకు విషయం వివరించి వారిని రాయగిరికి రావాలని చెప్పాడు. దీంతో అదే రోజు మధ్యాహ్నం 2గంటలకు వారు యాదగిరిగుట్టకు వచ్చారు. అక్కడి నుంచి వడాయిగూడెం గ్రామానికి వచ్చి భోజనం చేశారు. రాత్రి 7.30 గంటలకు గుడ్లను లోడ్ చేసుకోవడానికి రెండు వాహనాలు పౌల్ట్రీఫాంలోకి వచ్చాయి. ఆ సమయంలో గుడ్లను లోడ్ చేయడంలో సూపర్‌వైజర్ బిజీగా ఉండటాన్ని గమనించిన వడ్డే వెంకటేష్ బంధువులను పౌల్ట్రీఫాంలోకి రావాలని సూచించాడు. దీంతో వారు బైక్‌పై పౌల్ట్రీఫాం కార్యాలయం వెనుక భాగం వద్దకు వచ్చి గోడ దూకి ఫాంలోకి ప్రవేశించారు. ముగ్గురూ కలిసి తమ వెంట తెచ్చుకున్న స్క్రూ డ్రైవర్‌తో బీరువా తాళం పగులగొట్టి అందులో ఉన్న నగదును దొంగిలించి పారిపోయారు. అనంతరం రాయగిరిలో కలుసుకుని జల్సాలకు ఖర్చు చేయగా మిగిలిన డబ్బులను పంచుకున్నారు. సూపర్‌వైజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా మంగళవారం ఉదయం 6గంటలకు రాయగిరి వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా బైక్‌పై వెళ్తున్న వడ్డే వెంకటేష్, యాదగిరిని పట్టుకుని విచారించగా వారు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.2.80లక్షల నగదు, బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో మూడో వ్యక్తి రామాజనేయులును పట్టుకుని అతడి వద్ద నుంచి సెల్‌ఫోన్, రూ.10వేల నగదు స్వాధీనం చేసుకుని ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు.

కాల్వలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



పానుగోడు రిజర్వాయర్‌లో కళ్యాణ్ చక్రవర్తి మృతదేహం

పెన్‌పహాడ్: సాగర్ ఎడమ కాల్వలో గల్లంతైన యువకుడి మృతదేహం గరిడేపల్లి మండల పరిధిలోని పానుగోడు రిజర్వాయర్‌లో మంగళవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన మామిడి కళ్యాణ్ చక్రవర్తి(26) రెండు రోజుల క్రితం అన్నారం గ్రామశివారులో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు సాగర్ ఎడమ కాల్వలో జారి పడి గల్లంతయ్యాడు. గరిడేపల్లి మండల పరిధిలోని పానుగోడు రిజర్వాయర్‌లో మంగళవారం కళ్యాణ్ చక్రవర్తి మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి మామిడి సైదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

పరామర్శ..

మృతుడు కళ్యాణ్ చక్రవర్తి కుటుంబాన్ని మంగళవారం సూర్యాపేట జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, కొణతం సత్యనారాయణరెడ్డి పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన కారు

- ఐదుగురికి గాయాలు



ఘటనా స్థలిలో స్కూటీ, కారు

పెద్దవూర: రెండు ద్విచక్ర వాహనాలను కారు ఢీకొట్టడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం మండలంలోని పొట్టిచెల్మ క్రాస్ రోడ్డు సమ్మక్క–సారలమ్మ గద్దెల సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తిరుమలగిరి(సాగర్) మండలం నాగార్జునపేట తండాకు చెందిన పాత్లావత్ హేమ్లా, అతడి కుమారుడు బిచ్చులు మంగళవారం ఉదయం అల్వాల గ్రామానికి వచ్చి ఇంటికి తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని మండలంలోని సమ్మక్క–సారలమ్మ గద్దెల సమీపంలోకి రాగానే ఎదురుగా అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. అదే సమయంలో తిరుమలగిరి సాగర్ మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన హన్మంతు, పద్మ స్కూటీపై వస్తున్నారు. మొదట హేమ్లా, బిచ్చుల బైక్‌ను ఢీకొట్టిన కారు హన్మంతు, పద్మలు వస్తున్న స్కూటీని సైతం ఢీకొట్టి అదుపుతప్పి రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. దీంతో హేమ్లా, బిచ్చు, హన్మంతు, పద్మతో పాటు కారు నడుపుతున్న కేశవరెడ్డికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. అనంతరం హేమ్లా, హన్మంతు, బిచ్చు, పద్మను మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు.

అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

- ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో తప్పిన ప్రాణాపాయం



ప్రమాదానికి గురైన కారు

కొండమల్లేపల్లి: కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా, అందులోని ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సంజీవని ట్రస్ట్ వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన జి. కృష్ణ సంక్రాంతి పండుగకు కారులో ఊరికి వెళ్లి మంగళవారం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో చిన్నఅడిశర్లపల్లి వద్దకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సమయంలో కారులోని ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో కృష్ణకు ఎలాంటి గాయాలు కాలేదు.

అన్న చేతిలో తమ్ముడి హతం

- పొలానికి నీళ్లు పెట్టుకునే విషయమై ఇద్దరి మధ్య గొడవ
- కోపోద్రిక్తుడై గొడ్డలితో దాడి చేసిన అన్న
- పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు
- సూర్యాపేట మండలంలోని బాలెంల గ్రామంలో ఘటన



లింగయ్య (ఫైల్)

సూర్యాపేట రూరల్: వరుసకు అన్నదమ్ములైన ఇద్దరు వ్యక్తులు తమ పొలాలకు నీళ్లు మలుపుకునే విషయమై గొడవ పడ్డారు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన అన్న గొడ్డలితో తమ్ముడిని దారుణంగా నరికి చంపాడు. ఈ ఘటన సూర్యాపేట మండలంలోని బాలెంల గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలెంల గ్రామానికి చెందిన ఉప్పల సతీష్, ఉప్పల లింగయ్య(30) సొంతం పెద్దనాన్న, చిన్నాన్న కుమారులు. వరుసకు అన్నదమ్ములు. ఎస్సారెస్పీ కాలువ నుంచి తమ వ్యవసాయ పొలాలకు నీళ్లు పెట్టుకునేందుకు సోమవారం రాత్రి ఇద్దరూ తమ తమ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో నేనే ముందు నీళ్లు మలుపుకుంటా అంటే నేనే ముందు మలుపుకుంటానని ఇద్దరూ ఘర్షణ పడ్డారు. దీంతో కోపోద్రిక్తుడైన సతీష్ అప్పటికే తన వెంట తెచ్చుకున్న గొడ్డలితో ఉప్పల లింగయ్యపై దాడి చేశాడు. అక్కడే ఉన్న పలువురు రైతులు గాయపడ్డ లింగయ్య కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, హుటాహుటిన అతడిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడు సతీష్ సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి లొంగిపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు. అయితే సతీష్ గత రెండేళ్లుగా సైకోలా ప్రవర్తిస్తూ గ్రామంలో పలువురితో ఘర్షణ పడి మారణాయుధాలతో గాయపరిచినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సూర్యాపేట రూరల్ ఎస్ఐ ఆర్. సాయిరాం తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాసనాయుడు, సర్పంచ్ రామసాని రమేష్‌నాయుడు సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో లింగయ్య మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అర్ధరాత్రి ఇంటిపై దాడి

- కత్తులు, గొడ్డళ్లతో వెళ్లి మహిళను బెదిరించిన వైనం
- పలువురిపై కేసు నమోదు
- తాటికల్‌లో ఘటన

నకిరేకల్: భూ తగాదాల కారణంగా సోమవారం అర్ధరాత్రి తన ఇంటిపై కొందరు వ్యక్తులు కత్తులు, గొడ్డళ్లతో దాడి చేసి బెదిరించారని మండలంలోని తాటికల్ గ్రామానికి చెందిన నోముల శైలజ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. తాటికల్ గ్రామానికి చెందిన నోముల శైలజ, సైదులు దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి అదే గ్రామానికి చెందిన ముచ్చపోతుల వెంకన్న మధ్య గత కొంతకాలంగా భూతగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి 10.30గంటల సమయంలో వెంకన్నతో పాటు అదే గ్రామానికి చెందిన మనోహర్‌రెడ్డి, ప్రశాంత్, శివతో పాటు మరికొందరు గొడ్డళ్లు, కత్తులతో శైలజ ఇంటిపై దాడికి దిగారు. గేటు కింద పడేసి ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేసి 'నీ భర్త సైదులు ఎక్కడ అని' ప్రశ్నిస్తూ ఆమెతో అసభ్యకరంగా మాట్లాడారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మంగళవారం విచారణ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు నకిరేకల్ ఎస్ఐ గోపికృష్ణ తెలిపారు.

వరిలో తడి–పొడి పద్ధతి ఉత్తమం



మాట్లాడుతున్న స్వామి వివేకానంద గ్రామీణాభివృద్ధి సంస్థ సూపర్‌వైజర్ నాగమల్లయ్య

మునగాల: తడి–పొడి పద్ధతిలో వరి సాగు చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని స్వామి వివేకానంద గ్రామీణ అభివృద్ధి సంస్థ కోదాడ సూపర్‌వైజర్ టి. నాగమల్లయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరి సాగుపై రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతకాయల ఉపేందర్, సంస్థ మునగాల మండల కోఆర్డినేటర్ వై. రామకృష్ణ, సభ్యులు లక్ష్మణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడి చేస్తూ.. దిగుబడులు సాధిస్తూ..

- కూరగాయల సాగుతో అధిక ఆదాయం
- ఆదర్శంగా నిలుస్తున్న నడిగూడెం మండల రైతులు

పాడి పంట

నడిగూడెం: సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల పరిధిలోని పలు గ్రామాల రైతులు పంట మార్పిడి విధానంతో కూరగాయలు సాగుచేస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుకూలంగా పంటలను సాగుచేస్తూ, స్వతహాగా మార్కెటింగ్ ఏర్పాటు చేసుకొని నిత్యం ఆదాయం పొందుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రధానంగా నీటి సౌకర్యం ఉన్నా, సీజన్‌కు అనుకూలంగా మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌తో ప లు రకాల కూరగాయలు, ఆకు కూరలు సాగు చేస్తున్నా రు. బృందావనపురం, వేణుగోపాలపురం, కాగితరామచంద్రాపురం గ్రామాలకు చెందిన రైతులు వరికి బదులు పలు రకాల కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు.

బంతి, కూరగాయల సాగుతో..

బృందావనపురం గ్రామానికి చెందిన చాపల అంజయ్య తనకున్న అర ఎకరం భూమిలో బోరు సౌకర్యం ఉంది. గతంలో నిమ్మ సాగు ఉండేది. నిమ్మకు మద్దతు ధర లేకపోవడంతో ఆ తోటను తొలగించి గత రెండేళ్లుగా అదే భూమిలో బంతి, బెండ, వంగ, గోకర, దోస, బీర, సొర, ఆకు కూరలైన పాలకూర, మెంతి కూర, తోటకూర తదితర పంటలను సాగు చేస్తూ నిత్యం ఆదాయం పొందుతున్నాడు. గత సీజన్‌లో కేవలం బంతి పంటపైనే దాదాపు రూ.50 ఆదాయం పొందాడు. కూరగాయలకు తానే మార్కెటింగ్ కల్పించుకొని విక్రయిస్తూ ఆదాయం గడిస్తున్నాడు.



నడిగూడెం మండలం బృందావనపురం వద్ద ఆకుకూరలు సాగు చేసిన అంజయ్య



రహీం వ్యవసాయ క్షేత్రంలో దోస తోట చుట్టూ రక్షణ పంటగా సాగుచేసిన కంది

పెట్టుబడులు పోను సీజన్‌కు రూ.40 వేలు..

మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం గ్రామానికి చెందిన షేక్.రహీం తనకున్న ముప్పావు ఎకరంలో గతంలో వరి సాగు చేసేవారు. వరికి కూడా పెట్టుబడులు పెరుగుతుండడంతో గత సీజన్ నుంచి తీగ జాతి పంట దోస సాగు చేపట్టాడు. దీంతో పాటు రక్షణ పంటగా కంది పంట అలాగే అంతర పంటలో భాగంగా మొక్కజొన్న కూడా సాగు చేపట్టాడు. పండిన పంటను ఖమ్మం పట్టణంలోని మార్కెట్‌లో విక్రయిస్తూ, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన కూరగాయల వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పెట్టుబడులు పోను సీజన్‌కు రూ.40 వేలు సంపాదిస్తున్నాడు.

ఎకరంలో టమాట, దోస సాగు

బృందావనపురానికి చెందిన పుట్ట వీరబాబు ఎకరంలో గతంలో పత్తి సాగు చేయగా దిగుబడులు ఆశాజనకంగా రాలేదు. దీంతో ఈ ఏడాది అర ఎకరంలో టమాట, అర ఎకరంలో దోస సాగు చేపట్టాడు. పండిన పంటను నడిగూడెం, మునగాల చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.



బృందావనపురం వద్ద టమాట సాగుచేసిన పుట్ట వీరబాబు

పంట మార్పిడి పాటిస్తున్నా



నాకున్న అర ఎకరంలో బోరు కింద సీజన్‌లో డిమాండ్‌కు అనుకూలంగా బంతి, బెండ, వంగ, బీర, కాకర, పాలకూర, మెంతి కూర, తోటకూర పంటలను పండిస్తున్నా. పంట మార్పిడి పాటిస్తూ నిత్యం ఆదాయం పొందుతున్నా.

–చాపల అంజయ్య, బృందావనపురం

ప్రభుత్వం ప్రోత్సహించాలి



గతంలో పత్తి సాగు చేశాను. ఈ ఏడాది తొలిసారిగా ఒక ఎకరంలో టమాట, దోస సాగు చేపట్టా. పండిన పంటను ఖమ్మం, ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నా. మా లాంటి కూరగాయలు సాగు చేసే రైతులకు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసి ప్రోత్సహించాలి.

– పుట్టా వీరబాబు, బృందావనపురం

వరికి బదులు దోస సాగు



నాకున్న ముప్పావు ఎకరంలో గతంలో వరి సాగు చేశా. పెట్టుబడులు పెరగడంతో గత సీజన్ నుంచి దోస సాగు చేపట్టా. పెట్టుబడులు పోను రూ.40 వేలు మిగులుతుంది. అదనపు ఆదాయానికై రక్షణ పంటగా కంది సాగు చేపట్టా.

– షేక్.రహీం, కాగితరామచంద్రాపురం